ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY 5 జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం 20 డిసెంబరు 2024

ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్న అమాయకులు

- బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల వలలో యువత
- అవసరాల కోసం రుణ యాప్‌లపై పేదల మొగ్గు
- అవసరాల కోసం ఉచ్చులో పడుతున్న జనం
- బయట పడలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
- మెసేజ్, లింక్‌లకు స్పందించొద్దని సూచన
- మోసపోతే 1930ను సంప్రదించాలని సలహా

# జీవితాలతో 'సెల్'గాటం!






ప్రస్తుతం సెల్‌ఫోన్ మానవుడి దైనందిన జీవితంలో ఒక భాగమైంది. సెల్‌ఫోన్ లేనిదే గడపలేని పరిస్థితి నెలకొంది. చేసే పనిలో కొంత విరామం దొరికినా.. లేదా కాలక్షేపం కోసమైనా సెల్ ఫోన్ చూసుకునే రోజులున్నాయి. ఈ క్రమంలో కొందరు ఆన్‌లైన్‌లోకి తొంగిచూస్తున్నారు. బెట్టింగ్‌లు, గేమింగ్‌లు, లింకులు, ఇన్వెస్ట్‌మెంట్, మోసపూరిత ఉద్యోగ ప్రకటనలపైకి దృష్టి మరల్చి జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. కొంతమంది యువత తల్లితండ్రులకు తెలియకుండానే వారి ఖాతాల్లోని డబ్బులను బెట్టింగ్, గేమింగ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్, ఉద్యోగం వస్తుందేమోననే ఆశతో మోసపూరితమైన ప్రకటనలకు ఆకర్షితులమవుతున్నారు. అందులో విడతల వారీగా డబ్బులు పెట్టి చివరికి మోసపోయామని తెలుసుకొని జరిగిన నష్టాన్ని పూడ్చలేక విగత జీవులుగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో లింక్‌లు, యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. డబ్బు పోయిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. రూ.10 లక్షలకు పైగా మోసపోతే కమిషనరేట్‌లోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో, ఆలోపు అయితే స్థానిక పోలీస్‌స్టేషన్‌లలోనే ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు.

- వరంగల్ క్రైం

7

## మూగబోయిన జానపద ఝరి

**బలగం మొగిలయ్య కన్నుమూత**

- అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస
- పలువురి నివాళి.. భార్యకు ఆర్థిక సాయం
- దుగ్గొండిలో ముగిసిన అంత్యక్రియలు

ఆయన గొంతెత్తితే గాన మాధుర్యమే.. జానపదాలు చెబితే గంటల తరబడి రెప్పవాల్చకుండా చూడాల్సిందే.. పద్యం అందుకుంటే గుండెలు గిల్లుమనాల్సిందే.. ఆయనే.. బుడిగ జంగాల సామాజిక వర్గానికి చెందిన పస్తం మొగిలయ్య. సంచలన విజయం సాధించిన బలగం సినిమాలో పతాక సన్నివేశంలో మానవ సంబంధాల ఔనత్యాన్ని వివరిస్తూ చేసిన ఆయన గానం ప్రేక్షకుల కంట తడిపెట్టించింది. బలగం సినిమాకు ఆ సన్నివేశమే హైలైట్‌గా నిలిచింది. దీంతో మొగిలయ్య పేరు తెలుగువారందరికీ సుపరిచితమైంది. అంతలా ప్రేక్షకులతో కన్నీరు పెట్టించిన మొగిలయ్య అనారోగ్యంతో గురువారం కన్ను మూశారు. స్వస్థలం దుగ్గొండిలో అంత్యక్రియలు ముగిశాయి.

-దుగ్గొండి

7



# ఫైనాన్స్ దందా

- పెట్రేగిపోతున్న ప్రైవేటు వడ్డీ వ్యాపారులు
- అధిక మిత్తి వసూలు చేస్తూ వేధింపులు
- బెంబేలెత్తిపోతున్న సామాన్య జనం
- అధిక చెల్లింపులతో అవస్థలు





భూపాలపల్లిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు వడ్డీ వ్యాపారులు విజృంభిస్తున్నారు. కొందరు విచ్చలవిడిగా దందాను కొనసాగుతూ అప్పులు తీసుకున్న వారి రక్తాన్ని జలగల్లా పీల్చుతున్నారు. ఇష్టారాజ్యంగా అధిక వడ్డీలు వసూలు చేస్తూ అనేక మంది జీవితాలతో చెలగాటమాడుతున్నారు. గ్రామాల్లో బ్రోకర్లను నియమించుకొని అడ్డూ అదుపు లేకుండా వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నారు. వడ్డీలకు చక్ర వడ్డీలు విధిస్తూ సామాన్యుల నడ్డి విరిస్తున్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ సింగరేణి బొగ్గు గనులు, కాకతీయ విద్యుత్ కేంద్రం (కేటీపీపీ) ఉండటంతో పారిశ్రామికంగానే కాకుండా వ్యాపారపరంగా పురోగతి సాధిస్తోంది.. ఈ నేపథ్యంలో జనాభా గణనీయంగా పెరుగుతోంది. కార్మిక కుటుంబాలు ఇక్కడ స్థిరపడటంతోపాటు వ్యాపారులు నివాసాలను ఏర్పర్చుకున్నారు. ఇదే క్రమంలో అనేక వ్యాపార, వాణిజ్య సంస్థలతోపాటే ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలూ ఇక్కడ అడుగుపెట్టాయి. జిల్లాలో 20 నుంచి 30 వరకు ఈ సంస్థలు ఏర్పడ్డాయి. ఒక్క భూపాలపల్లి జిల్లా కేంద్రంలోనే సుమారు 12 కంపెనీలు ఉన్నాయి.

### నిబంధనలు అతిక్రమించి..

జిల్లాలో ఏర్పడిన ఫైనాన్స్ కంపెనీలు అన్నింటికీ అన్ని రకాల అనుమతులతోనే నడుస్తున్నాయని తెలుస్తోంది. వీటితోపాటు అనధికారంగా వందలాది మంది వడ్డీ వ్యాపారులు వెలిశారు. ఫైనాన్స్ కంపెనీల్లో కొన్ని నిబంధనలను అతిక్రమించి అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. వీరితోపాటు అనధికార వ్యాపారులు కూడా ఇదే తరహాలో అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నట్టు తెలుస్తోంది. ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకొని వారి జీవితాలను మరింత దుర్భరంగా మార్చుతున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ అక్రమ వ్యాపారంలో ప్రముఖంగా గిరిగిరి పేరుతో నడిపించేది సామాన్యులకు మరింత కఠినతరంగా ఉంది. దీని బారిన పడిన వారు ఆర్థికంగా కోలుకోని పరిస్థితి నెలకొంది. అప్పులు తీసుకున్న వారు రోజురోజుకూ అగాధంలో పడటం తప్ప బయట పడే మార్గం ఉండదు.

#### అవగాహనే ప్రధానం

ప్రభుత్వరంగ బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి రకరకాల ఆంక్షలు పెట్టడం, రుణం మంజూరు చేయడంలో తీవ్ర జాప్యం చేయడంతో విసిగివేసారి పోతున్న వినియోగదారులు తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేటు సంస్థలను ఆశ్రయించాల్సి వస్తోందని తెలుస్తోంది. అయితే.. అప్పులు తీసుకున్నప్పుడు ఆ సంస్థకు సంబంధించిన నిబంధనలు, వడ్డీ రేట్లు ముందే తెలుసుకోవాలని అంటున్నారు ఆర్థిక, న్యాయ నిపుణులు. బ్రోకర్లను నమ్మి మోసపోవద్దని సూచిస్తున్నారు.

### అధిక వసూళ్లకు అనేక సాకులు

జిల్లాలోని ఫైనాన్స్ కంపెనీలు ఎక్కువగా మార్టిగేజ్ (ఇల్లు, ఖాళీ స్థలం తాకట్టు పెట్టుకోవడం) రుణాలు ఇస్తున్నాయని తెలుస్తోంది. వీటితోపాటు బంగారు ఆభరణాలపై కూడా కొన్ని సంస్థలు అప్పులు ఇస్తున్నాయి. అయితే... రుణాలు తీసుకొనే సమయంలో నిబంధనలకు లోబడి వడ్డీ రేటు చూపించినా అనేక సాకులు చూపుతూ అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో వినియోగదారులకు అర్థం కాని రీతిలో గోప్యంగా కూడా అధిక వడ్డీలు, ఇతర చార్జీలు దండుకుంటున్నట్టు తెలుస్తోంది. అధిక వడ్డీలు వసూలు చేయడమే కాకుండా లేట్ అయితే ఫైన్ కూడా వసూలు చేయడం పరిపాటిగా మారింది. దీంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. భూపాలపల్లికి చెందిన ఓ వ్యక్తి మొదటగా తీసుకున్న రుణానికి 17శాతం వడ్డీ చెల్లిస్తూ వచ్చాడు. కానీ చివరకు 23శాతం వరకు వసూలు చేసినట్లు అతను లెక్కలు చూసుకొని అవాక్కయ్యాడు. ఇదేమిటని అడిగితే నిబంధనలు చదవలేదా? అని ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు సమాధానం ఇచ్చారని అతడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అలాగే గత నాలుగేళ్ల క్రితం ఓ వ్యక్తి ఓ సంస్థ నుంచి మార్టిగేజ్ రుణం పొందాడు. అయితే ఆ సంస్థ అనతికాలంలోనే బోర్డు తిప్పేసి మరో కంపెనీకి దాన్ని కట్టబెట్టింది. అయినప్పటికీ అతడు తాను తీసుకున్న రుణాన్ని తీర్చేశాడు. కానీ అతడి డాక్యుమెంట్లు మాత్రం ఎక్కడున్నాయో తెలియడం లేదు. పాత సంస్థ యజమానులు ఎక్కడ ఉన్నారో కూడా రుణగ్రహీతకు తెలియదు. కొత్త సంస్థలో అడిగితే తమ వద్ద అవి లేవని చేతులు ఎత్తేసింది.



### అగ్రిమెంటు ప్రకారం పనిచేయాల్సి ఉంటుంది

**- ఎన్.విష్ణువర్ధన్‌రావు, న్యాయవాది**

ఏ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ అయినా నిబంధనలు అతిక్రమించొద్దు. రుణ గ్రస్థులు అలాంటి పరిస్థితులు ఎదుర్కొంటే న్యాయ సహాయం పొందొచ్చు. అయితే.. అగ్రిమెంటు ప్రకారం వినియోగదారులు చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. క్రమం తప్పితే అపరాధ రుసుం వసూలు చేసే అధికారం ఫైనాన్స్ కంపెనీలకు ఉంటుంది. ఒకవేళ వినియోగదారుడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి, ఒకేసారి చెల్లించడానికి సిద్ధమైతే ఆ సంస్థ నిర్వాహకులకు ఈ విషయాన్ని వెల్లడించాలి. అంగీకరించకుంటే కోర్టును ఆశ్రయించి అసలును చెల్లించేలా వినియోగదారుడికి అవకాశం ఉంటుంది.

## ఎస్సీ వర్గీకరణ వినతులపై నివేదిక అందజేస్తాం..

- ఎస్సీ ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్
- హనుమకొండ కలెక్టరేట్‌లో విచారణ
- ఎస్సీ కుల సంఘాల నుంచి 135 వినతులు స్వీకరణ

6




మాట్లాడుతున్న డాక్టర్ జస్టీస్ షమీమ్ అక్తర్

## కమనీయం.. రమణీయం

- వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ

కాటారం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి మహా పడిపూజ మండల కేంద్రంలో వైభవంగా జరిగింది. 'ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్పా.. హరి హరసుతనే శరణమయ్యప్పా.' అంటూ భక్తుల ఆలపాలన మార్మోగింది. ఆధ్యాత్మిక గీతాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ వందలాదిమంది భక్తుల సమక్షంలో మహా పడిపూజ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని శ్రీఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో బుధవారం అర్ధరాత్రి నిర్వహించారు. దేవునూరి సదానందం పద్దెనిమిదో సారి (18వ నారీకేళా) అయ్యప్ప దీక్ష చేపట్టిన సందర్భంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ కనుల పండువగా సాగింది. వేదపండితులు సంఘభట్ల నరహరిశర్మ, నిఖిల్‌చారి ఆధ్వర్యంలో మెట్ల పూజ నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో కనువిందు చేసింది. ఈ కార్యక్రమంలో అర్చకుడు భానుప్రసాద్‌శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు బచ్చు అశోక్, ప్రకాశ్, గురుస్వాములు రామకృష్ణారావు, గంగిరెడ్డి లచ్చిరెడ్డి, జక్కు మొగిలి, చీమల రాజు, గుడాల శ్రీనివాస్, పసుల రామచంద్రం, ముస్కమల్ల సత్యం, ఐత వెంకన్న దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.



పడిపూజ నిర్వహిస్తున్న వేదపండితులు



భజన కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు

## ఎద్దు దాడితో జీపీ కార్మికుడి మృతి

మల్హర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎద్దు దాడి చేయడంతో గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎడ్లపల్లిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గు రం సమ్మయ్య(60) ఎడ్లపల్లి గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజులాగే గ్రామంలో చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు చేర్చాడు. పని ముగించుకొని గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నాడు. ట్రాక్టర్ దిగి ఇంటి వెళ్తున్న క్రమంలో కార్యాలయ ఆవరణలో అక్కడే ఉన్న ఎద్దు ఒక్కసారిగా అతడిపై దాడి చేసింది. దీంతో తీవ్ర రక్తస్రావమై సమ్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.



సమ్మయ్య(ఫైల్)

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రేగొండ డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. రేగొండ మండలంలోని రేపాక గ్రామానికి గ్రామానికి చెందిన హరిబాబుకు చెందిన ట్రాక్టర్, కాల్వపల్లికి చెందిన సమ్మయ్యకు చెందిన రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

## ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న అక్రమాలు

- భూకుంభకోణంలో మరో అక్రమం
- రైతుబంధు పేరుతో రూ.1.5 కోట్లకు పైగా స్వాహా
- అదే భూములపై వ్యవసాయ రుణాలు
- అవి చెల్లించకుండానే భూముల విక్రయం

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : పలిమెల శివారు భూకుంభకోణం అనేక అంశాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో మరో అక్రమం వెలుగుచూసింది. 2018లో ధరణి పోర్టల్ అందుబాటులోకి రాగా పలు ప్రాంతాలకు చెందిన వ్యక్తులు 2019లో దఫాలు దఫాలుగా సుమారు 253 ఎకరాలను డిజిటల్ సైన్ చేయించుకుని పట్టాలు పొందినట్లు సమాచారం. ధరణిలో భూరికార్డులు నమోదైనప్పటి నుంచి అంటే... 2019 నుంచి 2023వరకు ఎకరాకు సంవత్సరానికి రూ. 10 వేల చొప్పున ఐదేళ్ల వ్యవధిలో సుమారు రూ. 1.5 కోట్లకు పైగా ధరతో ప్రస్తుతం సిమెంటు కంపెనీకి విక్రయించిన వ్యక్తులు ఈ భూముల ద్వారా రైతుబంధు పొందినట్లు తెలిసింది. ఈభూములతోనే స్థానిక బ్యాంకుల్లో సైతం ఒకొక్కరు లక్షల్లో రుణాలు పొంది, అవి చెల్లించకుండానే రిజిస్ట్రేషన్లకు పూనుకోవడం హాట్‌టాపిక్‌గా మారింది. అయితే.. భూమి ఎక్కడుందో తెలియకపోయినా ఆ వ్యక్తులు పొందిన రైతుబంధు, వ్యవసాయ రుణాలను తిరిగి చెల్లించాలనే డిమాండ్ సైతం స్థానికుల నుంచి బలంగా వినిపిస్తోంది.

### గత అధికారులపై చర్యలుండేనా?

పలిమెల శివారులో వివాదాస్పదమైన ఈభూములను ధరణిలో నమోదు చేసిన గత అధికారులపై చర్యలుంటాయా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. 2018 ఎన్నికల బదిలీల్లో భాగంగా మంచిర్యాల జిల్లా నుంచి పలిమెలకు బదిలీపై వచ్చిన ఓ తహ సీల్దారు, అప్పటి ధరణి ఆపరేటర్ ఆధ్వర్యంలో పట్టాలు జారీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆ భూములను ధరణిలో ఆన్‌లైన్ చేసేందుకు ఒక్కో ఎకరాకు రూ.50 వేలు దండుకుని ఈ అక్రమానికి తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చి వరగా మరో తహసీల్దారు రెండు, మూడు ఫైళ్లను డిజిటల్ సైన్ చేసినట్టు సమాచారం. ధరణిలో అసలు రైతుల పేర్లు కా కుండా ఇతర ప్రాంతాల వ్యక్తుల పేర్లు ఎక్కించిన ఆ తహసీల్దా రు ఎవరనేది చర్చనీయాంశంగా మారింది. ఆ అధికారిపై చర్య లు ఉంటాయా.. లేదా? అనే ప్రశ్నలు సైతం వినిపిస్తున్నాయి.

### కాంగ్రెస్ వర్సెస్ టీఆర్ఎస్

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పలిమెల భూవ్యవహారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వార్ నడుస్తోంది. ఈ అక్రమాల్లో పాత్ర ఉందంటూ ఆయా పార్టీల నేతలు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. పలిమెల భూవ్యవహారంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన తమ్ముడు శ్రీనుబాబు పాత్ర ఉందంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకరి రాజబాపు, యూత్ కాంగ్రెస్ నాయకుడు కాట్రేవుల నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ నాయకులకు వచ్చే ఆదరణను చూసి ఓర్వలేక నిందలు వేసి అబాసు పాలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఇదే వ్యవహారంపై బీఆర్ఎస్ పలిమెల మండల అధ్యక్షుడు జవ్వాజీ తిరుపతి కూడా ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇకనైనా డ్రామాలు ఆపి రైతులకు మేలు చేసే కార్యక్రమం చేపట్టాలని హితబోధ చేశారు. దక్కన్ సిమెంటు కంపెనీ పేరు మీద ఉన్న రిజిస్ట్రేషన్లను రద్దు చేసి రైతుల పేర్ల మీద రిజిస్ట్రేషన్లను చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## గుండ్రాతిమడుగు ఏఈవో సస్పెన్షన్

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు రైతులను తప్పుదోవ పట్టించి, వారి అకౌంట్లో పడిన రైతుబీమా నిధులను ఆ తర్వాత తన అకౌంట్‌లోకి మళ్లించుకున్నందుకు కురవి మండలం గుండ్రాతిమడుగు క్లస్టర్‌కు చెందిన ఏఈవో కల్యాణ్‌ను వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి గురువారం ఉదయం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఈవో సస్పెన్షన్ అయిన విషయాన్ని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల ధ్రువీకరించారు. గుండ్రాతిమడుగు, గేటు తండాల్లోని రైతులు షైబుకు చెందిన రూ.1.50 లక్షలు, ఇరానీకి చెందిన రూ.5 లక్షలు, వెంకటమ్మకు చెందిన రూ.5 లక్షలను రైతుబంధు నిధులు పడగా, వారి ఖాతాల్లో నుంచి కల్యాణ్ తన అకౌంట్‌లోకి మళ్లించుకున్నారు. దీంతో ఆ మహిళ రైతు రైతుబీమా నిధులను తన అకౌంట్‌లోకి మళ్లించుకున్నాడని ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 17న కురవి వ్యవసాయాధికారి నర్సింహారావు, మరిపెడ ఏడీఏ విజయచంద్రలు గేట్‌తండాలో విచారణ జరిపి, నిధులు దారి మళ్లినట్లు జిల్లా వ్యవసాయాధికారిణికి నివేదించారు. దీంతో జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు ఈ విషయంపై నివేదించి, చర్చించిన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు నివేదించారు. దీంతో కమిషనర్ ఏఈవో కల్యాణ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఇనుగుర్తి మండలం పేరిట తొలి 'ఎస్‌హెచ్‌జీ' ప్రారంభం



ఇనుగుర్తి ఐవోబీలో కొత్త ఖాతాను ప్రారంభిస్తున్న రాంలాల్‌తండా ఎస్‌హెచ్‌జీ మహిళలు

ఇనుగుర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన ఇనుగుర్తి మండలంలో తొలి స్వయం సహాయక సంఘం(ఎస్‌హెచ్‌జీ) ఏర్పాటైంది. కోమటిపల్లి శివారు తారసింగ్‌తండా జీపీ రాంలాల్‌తండాకి చెందిన ధరణి గ్రామైక్య సంఘం పరిధిలో వీరభద్ర స్వయం సహాయక సంఘం నూతనంగా ఏర్పాటైంది. ఈ మేరకు ఇనుగుర్తిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో గురువారం ఆ సంఘం ఖాతాను ప్రారంభించినట్లు సంఘం అధ్యక్షురాలు బి.సుభద్ర, కార్యదర్శి ఎస్.సాలి తెలిపారు. మండల పరిధిలోని మిగతా గ్రామాల్లోని సంఘాలు తమ బ్యాంకులో ఖాతా తెరిస్తే రూ.10లక్షల రుణం ఇవ్వనున్నట్లు మేనేజర్ కె.రమేష్, అసిస్టెంట్ మేనేజర్ బి.రవీందర్ తెలిపారు. కాగా, మండలంలో తొలి స్వయం సహాయక సంఘం ఖాతా ఏర్పాటుతో త్వరలోనే ఐకేపీ ఇనుగుర్తిశాఖ సైతం ఏర్పాటు కానున్నట్లు గ్రామైక్య సంఘాల్లోని మహిళలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పెండింగ్ కేసులు లేకుండా పరిష్కరించాలి

**» తొర్రూరు డీఎస్పీ కృష్ణప్రసాద్**



సీరోలు పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ నిర్వహిస్తున్న కృష్ణప్రసాద్

సీరోలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులు లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని తొర్రూరు డీఎస్పీ కె.కృష్ణప్రసాద్ సూచించారు. సీరోలు పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ నిర్వహణకు ఉపయోగిస్తున్న పలు రికార్డులు, యూనిఫాం, ఆయుధాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదులు చేసేందుకు వచ్చే వారితో స్నేహపూర్వకంగా మాట్లాడి సమస్యను తెలుసుకోవాలన్నారు. పెండింగ్ కేసులు లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని విధులు నిర్వహించాలని ఎస్సై నగేష్‌కు సూచించారు. డీఎస్పీ వెంట మరిపెడ సీఐ రాజ్‌కుమార్ ఉన్నారు.

## నాలుగు రోజులు బ్యాంకు సేవల నిలిపివేత

బచ్చన్నపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణవికాస్ బ్యాంకును తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్చేందుకు ఉన్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈనెల 28 నుంచి 31 వరకు నాలుగు రోజులు బ్యాంకుకు సంబంధించిన లావాదేవీలు నిలిపివేస్తున్నట్లు మేనేజర్ గురుప్రీత్‌సింగ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రామీణ బ్యాంకులను అనుసంధానం చేస్తున్న మార్పులో భాగంగానే తెలంగాణాలో ఉన్న 493 ఏపీజీవీబీ శాఖలు, 9 రీజినల్ ఆఫీస్‌లు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం అవుతున్నాయన్నారు. 27లోపు అత్యవసర బ్యాంకింగ్ ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకోవాలని కోరారు. సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ అనుషా, క్యాషియర్స్ పవన్‌కృష్ణ, ఆకాంక్ష పాల్గొన్నారు.

## 'దేవాదుల' కాలువల భూసేకరణకు నిధులివ్వాలి

**» అసెంబ్లీలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ప్రాజెక్టులో కాలువల నిర్మాణానికి సంబంధించిన భూసేకరణకు నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. దేవాదుల ప్రాజెక్టు ప్యాకేజీ-8, ప్యాకేజీ-7లో 499 ఎకరాల భూమిని సేకరిస్తే కాలువల నిర్మాణం పూర్తి చేసుకునే అవకాశం ఉందని అన్నారు. కాలువల నిర్మాణం పూర్తయితే జనగామతో పాటు పక్కనే ఉన్న ఆలేరు నియోజకవర్గానికి కూడా నీరందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. భూసేకరణ కోసం రూ.178 కోట్లను మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని గతంలో జరిగిన రివ్యూ సందర్భంగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి కూడా తాను తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు. జనగామ నియోజకవర్గంలోని చెరువులు నిండనప్పటికీ ఆలేరుకు తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తరలించుకుపోతున్నారని అన్నారు. భూసేకరణ కోసం రూ.178 కోట్లు మంజూరు చేస్తే ఎలాంటి సమస్య లేకుండా జనగామ, ఆలేరు నియోజకవర్గాలకు నీరందుతుందని అన్నారు. దేవాదుల ద్వారా చెరువులు నింపేందుకు అవకాశం ఉన్నప్పటికీ అధికారులు పంపులను సరిగ్గా ఆన్ చేయడం లేదని, పంపులన్నింటినీ ఆన్ చేయడం ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులు పూర్తిగా నింపుకోవచ్చని అన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**» జేఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్**

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అక్రమ అరెస్టులతో వర్గీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ఆపలేరని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరును నిరసిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో గురువారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా మహబూబాబాద్‌లో తెల్లవారు జామున పిల్లి సుధాకర్‌తో పాటు నాయకులు దార కుమార్, పిల్లి రవి, దార సాత్విక్‌లను టౌన్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ...రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణపై రేవంత్‌రెడ్డి ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ వ్యతిరేక పనులకు శ్రీకారం చుడితే ప్రజాక్షేత్రంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.



టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టు అయిన పిల్లి సుధాకర్, నేతలు

## డివైడర్, లైటింగ్ ఏర్పాటు చేయాలి



మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మానుకోట పట్టణంలోని నెహ్రూసెంటర్ నుంచి మంగళికాలనీ వరకు డివైడర్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో సీపీఎంఆధ్వర్యంలో డీఈ ఉపేందర్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూసెంటర్ నుంచి రజాల్‌పేట వరకు రోడ్డు వెడల్పులో భాగంగా పేదలు, మధ్యతరగతి ప్రజలు తమ ఇళ్లను కోల్పోయారనిచెప్పారు. తమకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ వస్తుందని ఆశపడ్డ ప్రజలకు నిరాశ ఎదురైందని తెలిపారు. నెహ్రూసెంటర్ నుంచి బాబునాయక్ తండా క్రాస్‌రోడ్ వరకు మాత్రమే డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పడం శోచనీయమన్నారు. దానిని మంగళి కాలనీ వరకు పొడగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమ్మెట రాజమౌళి, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, నక్క సైదులు, ఎర్ర శ్రీనివాస్, ఎస్కే. తజ్జు, ఎమ్డీ. రజాక్, లాలయ్య, వెంకన్న, మందుల మహేందర్ పాల్గొన్నారు.

## మరోసారి సీఎంను కలిసిన ప్రభుత్వ విప్



సీఎంకు అభివృద్ధి పనుల నివేదిక అందజేస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మరిపెడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ గురువారం రాష్ట్ర అసెంబ్లీలోని ఆయన చాంబర్లో మరోసారి మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం రాత్రి డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నేత ఆర్.సురేందర్‌రెడ్డితో సీఎంను కలిసిన విషయం ఈ ప్రాంత ప్రజలకు తెలిసిందే. డోర్నకల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని వివిధ అభివృద్ధి పనుల వివరాలు, ఆ పనుల మంజూరి ఆవశ్యతపై సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తి వివరాలతో కూడిన నివేదికను రాంచంద్రునాయక్ సమర్పించారు. ముఖ్యమంత్రి సైతం సానుకూలంగా స్పందించి భరోసా ఇచ్చినట్లు తెలిసింది.

## సీపీఐ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

- **మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి**



సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

మహబూబాబాద్‌టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వార్షికోత్సవాలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వీరభవన్‌లో గురువారం సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని పెరుగుకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భం గా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 99 సంవత్సరాలు పూర్తయిందని, నాటి నుంచి నేటి వరకు పేదల పక్షాన ఉద్యమాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 26న పెద్దఎత్తున సీపీఐ జెండాలు ఎగురవేయాలన్నారు. అదేవిధంగా నల్లగొండలో డిసెంబరు 30న లక్ష మందితో జరుపతలపెట్టిన 100వ శతాబ్ది వేడుకల ప్రారంభోత్సవ వేడుకల బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సభకు జాతీయ కార్యదర్శి డి.రాజా హాజరవుతున్నారని చెప్పారు. సమావేశంలో తమ్మెర విశ్వేశ్వరరావు, బి.అజయ్‌సారథి రెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, రేషపల్లి నవీన్, వెంకన్న, పాండు రంగాచారి, సాంబలక్ష్మి, నాగేశ్వర్‌రావు, శేఖర్, రాజన్న, శ్రీనాథ్, స్వామి, రమేష్, రవీందర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి బ్రెయిన్‌డెడ్

- **అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు**



కన్నయ్య (ఫైల్)

చిలుపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తలకు తీవ్ర గాయం కావడంతో బ్రెయిన్ డెడ్ అయింది. ఐదు రోజులుగా మెరుగైన వైద్యం అందించినప్పటికీ కదలిక లేకపోవడంతో చేసేదేమీలేక అతడి కుటుంబ సభ్యులు అవయవాలను దానం చేసి ఉదారతను చాటుకున్నారు. ఈ ఘటన జనగామ జిల్లా చిలుపూరు మండలంలోని వంగాలపల్లిలో గురువారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఆవుల కన్నయ్య (37) తనకున్న కొద్దిపాటి వ్యవసాయంతో పాటు, డెయిరీ నిర్వహిస్తున్నాడు. కాగా, అతడు నిత్యం పాలు విక్రయించేందుకు హనుమకొండకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 15న (ఆదివారం) తన బైక్‌పై పాల క్యాన్లతో హన్మకొండకు వెళ్తున్నాడు. నిట్ కళాశాల దగ్గర యూటర్న్ చేస్తుండగా హనుమకొండ నుంచి కాజీపేట వైపు వేగంగా వెళ్తున్న ఓ యువకుడు బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కన్నయ్యను స్థానికులు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ అయినట్లు గుర్తించిన అక్కడి వైద్యులు పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించారు. దీంతో వారు కన్నయ్యను సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. చికిత్స ప్రారంభించి రెండు రోజులైనా అతనిలో కదలికలు లేకపోవడంతో అక్కడి వైద్యులు చేతులెత్తేశారు. దీంతో కుటుంబ సభ్యులు అవయవదానం చేసి ఆదర్శంగా నిలిచారు. కన్నయ్య అకాల మృతితో వంగాలపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఉరివేసుకుని యువతి ఆత్మహత్య



లావణ్య మృతదేహం

పెద్దవంగర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చిట్యాల గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... చిట్యాల గ్రామానికి చెందిన ఈదురు యాకయ్య- సోమలక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో మొదటి కుమార్తె ఈదురు లావణ్య(25) డిగ్రీ పూర్తి చేసింది. ఇటీవల తల్లిదండ్రులు ఓ వ్యక్తితో నిశ్చితార్థం నిర్వహించారు. ఏమైందో ఏమోగాని ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు వచ్చిచూసే సరికి అప్పటికే మృతి చెంది విగతజీవిగా ఉంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. వివాహం జరగాల్సిన ఇంట్లో విషాదం చోటు చేసుకోవడంతో తల్లిదండ్రులు, బంధవులు కన్నీరు మున్నీరయ్యారు.

## కేజ్‌వీల్స్ తగిలి వ్యక్తి మృతి

బచ్చన్నపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేజ్‌వీల్స్‌తో వెళుతున్న ట్రాక్టర్ తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన బచ్చన్నపేట మండలంలోని చిన్నరామన్‌చర్ల రహదారిపై గోపాల్ నగర్ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎస్‌కే హమీద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నక్కవానిగూడెం గ్రామానికి చెందిన గుంటిపల్లి యాదగిరి (52) వ్యక్తిగత పనులపై చిన్నరామన్‌చర్ల వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. బచ్చన్నపేటకు చెందిన శివరాత్రి వెంకటేశ్ అనే వ్యక్తి ట్రాక్టర్‌కు కేజీవీల్స్ వేసుకుని అజాగ్రత్తగా నడుపుతూ వస్తుండగా అవి తగిలి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.

కాగా, ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్‌కే హమీద్ తెలిపారు.

## టీచర్లు లేక ఆగిన ఎఫ్‌ఏ-3 పరీక్షలు

కన్నాయిగూడెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు లేక షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన ఎఫ్‌ఏ-3 పరీక్షలు నిలిచిపోయిన ఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో జరిగింది. ముప్పనపల్లి కేజీబీవీ పాఠశాలలో ఈనెల 17 నుంచి ఎఫ్ఏ 3 పరీక్షలు జరగాల్సి ఉండగా టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్‌స్టాఫ్ అందరూ గైర్హాజరయ్యారు. తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ పదిరోజులుగా జిల్లా కేంద్రంలో వారు సమ్మె చేస్తున్నారు. ఇందులో ముప్పనపల్లి పాఠశాల ఉపాధ్యాయులతో పాటుగా ఇతర సిబ్బంది కూడా పాల్గొంటున్నారు. టీచర్స్ అందుబాటులో లేకపోవడంతో పది రోజులుగా పాఠాలు జరగడం లేదు. ఈ పాఠశాలలో టీచింగ్ స్టాఫ్ తొమ్మిది మంది, నాన్ టీచింగ్ స్టాఫ్ పది మంది ఉన్నారు. ఇందులో వంట మనుషులు, వాచ్‌మెన్‌తో పాటుగా ఒక టీచర్ మాత్రం పిల్లలకు కాపలాగా ఉంటున్నారు. మిగతా సిబ్బంది అందరూ సమ్మెలో పాల్గొంటున్నారు. ఇప్పటికే పది రోజులుగా పాఠ్యాంశాలు బోధన లేకపోవడం, ఎఫ్‌ఏ- 3 పరీక్షలు నిర్వహించ లేదు. ఇదిలా ఉండగా జనవరి మొదటి వారంలో జరిగే ఎస్‌ఏ- 2 పరీక్షలకు సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కాగా, గురువారం పదో తరగతి పరీక్ష షెడ్యూల్ కూడా విడుదల కావడంతో మార్చిలో జరిగే పది పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాల్సిన ఉపాధ్యాయులు సమ్మెలో ఉండటంతో విద్యార్థులు సైతం ఆందోళన చెందుతున్నారు.



గోదావరిలో వీఐపీ ఘాట్ వద్ద చెత్తాచెదారం

## నిర్లక్ష్యానికి నిదర్శనం

**» కాళేశ్వరంలో లోపించిన పారిశుధ్యం**

మహదేవపూర్‌రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర త్రివేణి సంగమం వద్ద పారిశుధ్యం లోపించింది. ప్రధాన ఘాట్‌తో పాటు వీఐపీ ఘాట్ చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఎక్కడ చూసిన పాతబట్టలు, కుండలు, వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయి. దీంతోపాటు బస్టాండ్ నుంచి పుష్కరఘాట్‌కు వెళ్లే మార్గంలోనూ ఉదయం వేళల్లో నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఎంతో పవిత్రంగా ఆ పరమ శివుడిని దర్శించుకోవాలని వచ్చిన అంతా అపవిత్రంగానే వెళ్లాల్సి వస్తోందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు దీనిపై దృష్టి సారించకపోవడంతో పలు మార్గాల్లోనూ చెత్తాచెదారంతో నిండిపోతోందని భక్తులు, గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకుని వీఐపీ, సాధారణ ఘాట్లను శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పుణ్యక్షేత్రం ఇట్లుంటే భక్తులెట్లా వస్తారనే ఆందోళన స్థానికుల్లో నెలకొంది.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి

**» బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి**



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి

పాలకుర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పథకాలను పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శివం గార్డెన్‌లో గురువారం మండల స్థాయి శక్తి కేంద్రం ఇన్‌చార్జిల సమావేశం జరుగగా ముఖ్య అతిథిగా దశమంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో గత ఎన్నికల కోసం చేపట్టిన బీజేపీ సభ్యత్వం లక్ష వరకు నమోదయిందన్నారు. బీజేపీని నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్మాణం కోసం పార్టీ కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వం గణనీయంగా పెరిగిందన్నారు. వచ్చే నాలుగేళ్లలో బీజేపీ నెంబర్ వన్ స్థానంలో ఉండేలా ప్రతీ కార్యకర్తలా పని చేయాలని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, మండల అధ్యక్షుడు దుంపల సంపత్, కమ్మగాని శ్రీకాంత్, మారం రవి, వేల్పుల దేవరాజ్, కడుదల నిరంజన్‌రెడ్డి, పెనుగొండ సోమేశ్వర్, రామారావు ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణ వినతులపై నివేదిక అందజేస్తాం

**» ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్**



కమిషన్‌కు ఇచ్చిన వినతిపత్రాన్ని చూపిస్తున్న పంబాల కులవృత్తి కళాకారుల సంఘం నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం నిర్వహించిన బహిరంగ విచారణలో తమ దృష్టికి వచ్చిన అభ్యర్థనలు, విన్నపాలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు. రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో షెడ్యూల్డ్ కులాల్లో వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని బహిరంగ విచారణ నిర్వహించారు. వర్గీకరణపై ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ ఎస్సీ కుల సంఘాలు ఇచ్చిన దరఖాస్తులను ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వివిధ ఎస్సీ కుల సంఘాల నుంచి 135 వినతులు, అభ్యర్థనలు వచ్చాయన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన న్యాయపరమైన అంశాలు, ఉద్యోగ, సామాజిక పరిస్థితులు, చరిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్నిప్రాంతాల కుల సంఘాల అభ్యర్థనలు, వినతులు సేకరించి ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందజేసి న్యాయం చేస్తామన్నారు.

### స్వాగతం పలికిన ఇన్‌చార్జి కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్న ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఘనంగా సన్మానించారు. వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల నుంచి ఎస్సీ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ నాయకులు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర, ఉమ్మడి జిల్లా కమిటీ నాయకులు, ధర్మసమాజ్ పార్టీ నాయకులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎస్సీ వర్గీకరణ చేయాలని వినతులు అందజేశారు. జాతీయ మాల మహానాడు నాయకులు ఎస్సీ వర్గీకరణ చేయొద్దని వినతిపత్రం అందజేశారు. అదే విధంగా అత్యంత వెనుకబడిన పంబాల కులాన్ని ఎస్సీ ఏ గ్రూపులో చేర్చి జనాభా ప్రాతిపదికన కాకుండావ వెనుకబాటు ప్రాతిపదికన ఎక్కువ రిజర్వేషన్ కల్పించాలని పంబాల కులవృత్తి కళాకారుల సంఘం నాయకులు కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, వరంగల్ ఉమ్మడి జిల్లా డీఎస్సీ డీఓ, ఎస్‌డబ్ల్యూఓలు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఈవీ శ్రీనివాస్‌రావు, జిల్లా అధికారులు, ఎస్సీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు (బిల్టీ రకం) | - | - |
| పల్లికాయ (సూక) | 6012 | 3000 |
| పల్లికాయ (పచ్చిది) | 5200 | 4500 |
| కందులు | - | - |
| పెసళ్లు | 5212 | 4000 |
| పత్తి | 7020 | 5800 |
| పసుపు (కాడి) | 10469 | 9823 |
| పసుపు (గోల) | 10336 | 9834 |
| తేజ మిర్చి | 12000 | 9000 |
| తేజ మిర్చి (కొత్తది) | 16100 | 12000 |
| తేజ ఏసీ | 15500 | 14000 |
| వండర్‌హాట్ ఏసీ | 14000 | 13000 |
| యూఎస్341ఏసీ | 15000 | 11000 |
| దేశీ ఏసీ | - | - |
| సింగిల్‌పట్టి ఏసీ | - | - |
| తాలు మిర్చి | 7000 | 3000 |

- వరంగల్ వ్యవసాయం

### ఆన్‌లైన్ మోసాలపై 1930ను సంప్రదించాలి

ఆన్‌లైన్ ద్వారా చేసే ప్రతీ పనిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మన పని మనం చేసుకుంటుండగానే మోసపూరితమైన లింక్‌లు, మెసేజ్‌లు వస్తుంటాయి వాటి జోలికి వెళ్లకూడదు. మోసం జరిగినట్లు గ్రహిస్తే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేకంగా సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ పని చేస్తోంది. ఫిర్యాదుల ద్వారా చాలామందిని కాపాడగలిగాం. ఏ ఒక్కరూ ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, లోన్ యాప్‌లు, ఒకటికి రెండింతలు డబ్బులు ఇస్తామనే మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దు. ముఖ్యంగా పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వొద్దు.

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్



# జీవితాలతో సెల్‌గాటం!

## ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్న అమాయకులు

**బయట పడలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న వైనం**

**అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు**

వరంగల్ క్రైం, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక రంగంలో అనేక మార్పులు వస్తున్నాయి. దానిని సరిగ్గా వినియోగించుకునే వారు లక్షలో వేతనాలు పొంది విలాసవంతంగా జీవిస్తుంటే.. దానిని దుర్వినియోగం చేసుకునే వారి జీవితాలు రోడ్డున పడుతున్నాయి. తద్వారా వచ్చే మానసిక ఒత్తిళ్లను తట్టుకోలేక బలవన్మరణం పొందుతూ కుటుంబాలకు శోకం మిగుల్చుతున్నారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు ఆన్‌లైన్ వేదికగా ఒకటికి రెండింతలు డబ్బులు ఇస్తామని ప్రసారమయ్యే మోసపూరిత ప్రకటనలను ఆకర్షితులై చట్టబద్ధత కానీ యాప్‌లు, లింక్‌ల ద్వారా డబ్బులు పెట్టి చివరికి మోసపోయామని లబోదిబోమంటున్నారు. మరికొంతమంది లోన్‌యాప్‌ల ద్వారా రుణాలు పొంది వాటిని ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లపై పెట్టుబడిగా పెట్టి ఆ తర్వాత డబ్బులు కోల్పోయి రోడ్డున పడుతున్నారు. ఆ నష్టాన్ని పూడ్చలేక అడ్డదారులు తొక్కి చివరికి ఆ సమస్య నుంచి బయటపడలేక మానసిక ఒత్తిళ్లతో అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు.

### ఆశ చూపి వలలోకి..

సైబర్ దొంగలు వివిధ మార్గాల్లో ప్రజలను తమ వలలోకి దింపి జేబులు లూటీ చేస్తున్నారు. ఉద్యోగం, ఇన్వెస్ట్‌మెంట్, కొరియర్ పేరిట ముందుగా ఆకర్షించి ఆ తర్వాత నట్టేట ముంచుతున్నారు. ఆన్‌లైన్‌లోని మోసాలకు ఎలాంటి తారతమ్యం లేకుండా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, చిరు వ్యాపారాలు, గృహిణులు, చిన్నా, పెద్ద తేడా అందరూ ఆకర్షితులై డబ్బులు సమర్పించుకుంటున్నారు. రుణయాప్ ద్వారా లోన్ తీసుకున్న వారు తిరిగి చెల్లించలేక, నిర్వాహకులు పెట్టే వేధింపులు భరించలేక కొంతమంది ప్రాణాలు తీసుకుంటున్నారు. లోన్ యాప్ నిర్వాహకుల నుంచి రుణం పొందితే సకాలంలో డబ్బులు తిరిగి చెల్లించకున్నా.. ఆలస్యం చేసినా.. రుణగ్రహీతలు ఫొటోలను మార్ఫింగ్ చేసి వారి బంధువులకు, ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్‌కు పంపిస్తున్నారు. అలాంటి సమయంలో రుణ గ్రహీతలు అవమాన భారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

### అత్యాశకుపోయి.. ఉన్నది పోగొట్టుకుని..

ఈ మధ్యకాలంలో వాట్సాప్‌కు వచ్చే లింక్ మెసేజ్‌లను నొక్కి అటు నుంచి గుర్తుతెలియని వ్యక్తి డబ్బులు వస్తాయనే ఆశ చూపగానే విడతల వారీగా డబ్బులను పంపించి నష్టపోతున్నారు. ఈ రకమైన మోసాల బాధితులే అత్యధికంగా పోలీసులు ఆశ్రయిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుల్లో రోజుకు ఒకటి, రెండైనా ఇలాంటివి ఉంటున్నాయి. మీరు పెట్టే డబ్బులు రెట్టింపు అవుతాయనగానే ఆలోచించకుండా డబ్బులు వేసి ఆ తర్వాత లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌కు పరిగెత్తుకుంటూ వెళుతున్నారు.

### సైబర్ క్రైం కేసులు

వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఉన్న సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌తో పాటు మూడు జోన్‌లలో ఉన్న ఆయా పోలీస్‌స్టేషన్‌లలో సైబర్ క్రైంకు గురైన బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో 142 కేసులు నమోదు కాగా, కమిషనరేట్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో 173 కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ నుంచి సమారు రూ.32 లక్షలకు పైగా బాధితులకు ఇప్పించగా, పోలీస్‌స్టేషన్ల నుంచి రూ.కోటి 30 లక్షల వరకు రీఫండ్ చేయించగలిగారు.



### యాప్ మోసాలకు బలి..

- ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా రూ.1,60,000 కోల్పోయిన శాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజుపల్లికి చెందిన ఆవుల దిలీప్.. పురుగుల మందు తాగి ఈ ఏడాది మే 31న ఆత్మహత్య చేసుకున్నాడు.
- లోన్ యాప్ నిర్వాహకుల వేధింపుల కారణంగా ఈ ఏడాది ఆగస్టు 31న మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కరీమాబాద్ జన్మభూమి జంక్షన్ ప్రాంతానికి చెందిన విద్యార్థి కంభంపాటి విష్ణువర్ధన్ చీరతో ఉరి వేసుకొని బలవన్మరణం పొందాడు.
- భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగకు చెందిన రేషన్ డీలర్ గొడిశాల పైడయ్య ఇంటి నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో రుణం తీసుకొని ఈఎంఐ చెల్లించలేదు. లోన్ యాప్ నిర్వాహకులు ఒత్తిడి పెంచడంతో ఈ ఏడాది జూన్ 27న రేషన్‌షాపులోనే ఉరి వేసుకొని మరణించాడు.
- వర్ధన్నపేట కడారిగూడెంకు చెందిన బీటెక్ విద్యార్థి బత్తిని గణేశ్ ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం స్నేహితుల వద్ద అప్పు చేసి తీర్చలేక ఈ ఏడాది అక్టోబర్ 23న పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ 29న హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో మరణించాడు.
- డిసెంబర్ 16న వర్ధన్నపేట మండలం బండతౌపురానికి చెందిన మరుపట్ల హనూక్ (26) ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ.6లక్షలు పోగొట్టుకొని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.



### అడ్డదారులు తొక్కి కటకటాల్లోకి..

బెట్టింగ్‌లు, గేమింగ్‌లు, వ్యక్తిగత అవసరాల కోసం ఆన్‌లైన్ లోన్‌యాప్‌లు ఆశ్రయించి రుణాలు తీసుకొని వాటిని తీర్చలేక కొందరు అడ్డదారులు తొక్కుతూ చివరికి చోరీలకు పాల్పడుతున్నారు. దీనిలో భాగంగా వరంగల్ జిల్లా రాయపర్తి మండలానికి చెందిన కొండపల్లి ధర్మారాజు.. బిర్యానీ సెంటర్ నడిపి నష్టపోయాడు. అనంతరం హనుమకొండ రెవెన్యూకాలనీకి మకాం మార్చి అద్దె ఇంట్లో ఉన్నాడు. నష్టపోయిన డబ్బును తిరిగి పొందేందుకు ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా సంపాదించాలని ప్లాన్ వేశాడు. వాటి ద్వారా ఇంకా నష్టపోయాడు. దీంతో దొంగగా మారి చోరీలు చేయడం ప్రారంభించాడు. ఇలా 13 చోరీలు చేసి చివరికి కేయూ పోలీసులకు చిక్కి జైలులో ఊచలు లెక్కపెడుతున్నాడు.



**అలెర్ట్**

# లింకు నొక్కారో.. కాసులు కల్లాస్!

## రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- అవగాహన లేక కొందరు.. ఆశతో మరికొందరు
- ఇప్పటికే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న వాళ్లు కోకొల్లలు
- స్వీయ జాగ్రత్తలతోనే సైబర్ నేరాల నియంత్రణ

లింగాలఘణపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మీ బ్యాంకు అకౌంట్ బ్లాక్ అయింది. మీ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది చెప్పండి అంటూ బ్యాంకు అధికారుల పేరుతో తెలియని వ్యక్తులు కాల్ చేస్తుంటారు. మరికొందరికేమో మీరు లక్కీ డ్రాకు ఎంపికయ్యారు.. మేమడిగే అతి సులభమైన రెండు ప్రశ్నలకు సమాధానం చెప్పండి.. ఆతర్వాత మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీ చెప్పండి.. క్షణాల్లో ఇక లక్కీ డ్రా డబ్బులు మీ సొంతం అంటూ బురిడీ కొట్టిస్తారు. ఇటీవల ఇలాంటి ఫేక్ కాల్స్ ఎక్కువయ్యాయి. పొరపాటున వారి మాటలు నమ్మి ఓటీపీలు చెప్పారో.. నిజంగానే బ్యాంకులో ఉన్న మీ కాసులు కల్లాస్ అవ్వాల్సిందే. ఏం జరిగిందో తెల్సుకుని తేరుకునేలోపే సైబర్ నేరగాళ్లు మన ఖాతాల్లో డబ్బులను మాయం చేస్తారు.. సైబర్ నేరగాళ్లు ఇటీవల కాలంలో ఒక అడుగు ముందుకేసి ఖాతాల్లో ఉన్న డబ్బులను మాయం చేయడమే కాకుండా బ్యాంకు ఖాతాలతో లింక్ అయిన మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్‌ను బ్లాక్ చేస్తున్నారు. రోజు రోజుకు సాంకేతిక అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇలాంటి సైబర్ నేరాల తీవ్రత కూడా అంతే స్థాయిలో పెరుగుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. ఓ వైపు పోలీసులు, మరో వైపు స్వచ్ఛంద సంఘాలు సైబర్ నేరగాళ్ల చేస్తున్న మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు ఊరూరా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా రోజుకొక్కటి చొప్పున నేరాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో నిరక్షరాస్యులు పడుతున్నారేమో అనుకుంటే పొరపాటే.. అన్నీ తెలిసిన చదువుకున్న వారే.. వీరిలో బ్యాంకుల ఉద్యోగులు కూడా ఉంటుండటం గమనార్హం.

### అవగాహన లేక కొందరు.. అత్యాశతో మరికొందరు..

పెరుగుతున్న సాంకేతికత, అందరి చేతిలోకి స్మార్ట్ ఫోన్లు అందుబాటులో రావడం, వాటికి తగ్గట్టుగా తక్కువ ధరలకే ఇంటర్నెట్ సేవలు అందుతుండటంతో ఎటు నుంచి ఏ సైబర్ కేటుగాడు మోసానికి పాల్పడతాడో అర్థం కాని పరిస్థితి. మారుమూల పల్లెలోని చిరుదుకాణాల నుంచి కార్పొరేట్ స్థాయి షాపింగ్‌లు, సూపర్‌మార్కెట్లలో సైతం కొనుగోళ్ల అమ్మకాలకు చెందిన ప్రతీ లావాదేవీని యూపీఐ అకౌంట్ ద్వారా చేస్తున్నారు. అయితే ఆర్థిక లావాదేవీలు చేస్తున్న ప్రతీ యూపీఐ చెల్లింపులన్నీ ప్రైవేటుకు చెందింది కావడంతో మన వ్యక్తిగత సమాచారం మొత్తం వాళ్ల వద్ద ఉండిపోతోంది. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతూ మోసాలకు తెరలేపుతున్నారు. మెసేజ్, వాట్సాప్‌ల ద్వారా తప్పుడు లింకులు షేర్ చేస్తున్నారు. తెలిసీ తెలియక వాటిని నొక్కిన వెంటనే మన ఖాతాల్లోని డబ్బంతా మాయమైపోతోంది. వీటితో పాటుగా కొంతమంది నకిలీ వెబ్‌సైట్లను క్రియేట్ చేస్తుండటంతో స్మార్ట్ ఫోన్లకు వచ్చే బల్క్ వెబ్‌సైట్లలో నకిలీవి ఏవో.. అసలువి ఏవో తెలియక ప్రజలు మోసాలకు గురవుతున్నారు. ఇలాంటి సైబర్ మోసంలో చిక్కుకునే వాళ్లలో కొంతమంది ఏం తెలియని వారుంటుండగా మరికొందరు అత్యాశతో రాత్రికి రాత్రే కోటీశ్వరులుగా ఎదగాలని అత్యాశతో నిండా మునుగుతున్నారు. కొందరు ఆదాయ పన్ను నుంచి తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ మోసాల బారిన పడిపోతున్నారు. ఇంకొంతమంది యువత ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి ఖాతాలను గుల్ల చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ గేముల్లో మొదట గెలిచినట్టు అవకాశం కల్పించి రెట్టింపు డబ్బులు చెల్లించి పూర్తిగా నమ్మించిన తర్వాత ఖాతాలో ఉన్న డబ్బును మొత్తం మాయం చేస్తున్నారు. ఇలాంటి ఘటనే ఇటీవల లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో ఓ యువకుడుపెద్ద మొత్తంలో తన డబ్బును పోగొట్టుకున్నట్టు సమాచారం.

- జనగామ జిల్లాలో జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు బలై రూ. లక్షల్లో మోసపోయాడు. అదేవిధంగా టీజీఎస్‌పీడీసీఎల్‌లో పనిచేసే ఓ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల మోసానికి రూ. 89వేలు పోగొట్టుకున్నారు. లింగాలఘణపురం మండలానికి చెందిన ఓ గ్రామపంచాయతీ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల కారణంగా తన ఖాతాలోని రూ. 40వేలు మాయం చేసుకున్నాడు.



సైబర్ మోసాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నర్మెట సీఐ అబ్బయ్య(ఫైల్)

### అపరిచితులకు వ్యక్తిగత సమాచారం షేర్ చేయొద్దు



అపరిచిత వ్యక్తులు పంపే లింకులను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దు. అదేవిధంగా ఎవరైనా ఫోన్ చేసి ఆధార్‌నెంబర్, బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఓటీపీ అడిగితే ఎవరికి కూడా షేర్ చేయకూడదు. సైబర్ నేరగాళ్లు మోసం చేసేందుకు అనేక రూపాల్లో స్మార్ట్ ఫోన్‌ద్వారా మోసం చేసేందుకు సిద్ధంగా ఉంటారు. అటువంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలి.

- శ్రీనివాస్‌రెడ్డి, సర్కిల్ ఇన్స్‌పెక్టర్, జనగామ రూరల్



సైబర్ అంబాసిడర్‌గా మహిళలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థిని(ఫైల్)

### సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కకుండా జాగ్రత్తలు ఇలా పాటించాలి..



- సైబర్‌క్రైం జరిగిన వెంటనే / 24 గంటల లోపు 1930కి ఫోన్ కాల్ చేసి సమాచారమివ్వాలి. లేదా cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలి.
- వెబ్‌సైట్‌లు అసలువా లేక నకిలీవా అని తెల్సుకునేందుకు http:///www.getsafeonline.org లో నిర్ధారించుకోవాలి
- మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులు తొందరపడకుండా జాగ్రత్తగా గమనించి ఓపెన్ చేయాలి
- థర్డ్‌పార్టీ అప్లికేషన్లు ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దు
- బహుమతి వచ్చిందని ఎస్ఎంఎస్‌లు వస్తే నమ్మిమోసపోవద్దు
- అపరిచితులకు తమ ఖాతా నెంబర్లు, ఓటీపీలు ఇవ్వకుండా ఉండాలి
- యూపీఐల ద్వారా డబ్బులు చెల్లించే ఖాతాల్లో వీలైనంత మేరకు తక్కువ డబ్బులను ఉంచుకోవడం శ్రేయస్కరం.
- ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్లను ప్రభుత్వం నియమించింది. వారిని సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చు



మొగిలయ్య భౌతిక కాయం



మొగిలయ్య(ఫైల్)

# మూగబోయిన జానపద ఝరి

## 'బలగం' మొగిలయ్య కన్నుమూత

- అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస
- పలువురి నివాళి.. ముగిసిన అంత్యక్రియలు

దుగ్గొండి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ జానపద కళాకారుడు, 'బలగం' ఫేమ్ పస్తం మొగిలయ్య (67) కన్నుమూశారు. రెండేళ్లుగా రెండు మూత్రపిండాలు ఫెయిలై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. కాగా, మొగిలయ్య స్వస్థలంలో మొగిలయ్య భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించి రూ.50వేలు మొగిలయ్య భార్య కొమురమ్మకు అందించారు. అదేవిధంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు టీపీసీసీ కార్యదర్శి బొమ్మెనపెల్లి అశోక్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించి రూ.50వేలు ఆర్థికసాయం చేశారు. బలగం సినిమాలో నటించిన రచ్చ రవి, బాలు సందర్శించి నివాళులర్పించారు. తెలంగాణ సాంస్కృతిక కళాబృందం సభ్యులైన యోచన, తాళ్ల సునిల్ నివాళుల ర్పించారు. స్థానిక నాయకులు, కళాకారులు సందర్శించి నివాళులర్పించారు. కాగా, మొగిలయ్యను చూడడానికి కులస్థులు, వివిధ గ్రామాలకు చెందిన పలువురు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జనం మధ్య క్రైస్తవ మతఆచారం ప్రకారం మొగిలయ్య అంత్యక్రియలు ముగిశాయి.



మొగిలయ్యకు నివాళులర్పిస్తున్న రచ్చ రవి, బాలు

### సంప్రదాయ కళతో..



వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన పస్తం మొగిలయ్య (67), కొమురమ్మ దంపతులు జానపదాలు, బుర్రకథలు చెబుతూ జీవనం సాగించారు. పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వస్తున్న జానపద కళల్లో ఒకటైన బుర్ర కథలే వృత్తిగా ఎంచుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు గోదావరి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో బుర్ర కథలు చెప్పేవారు. నిరక్షరాసులైనా కళలో ప్రత్యేక గుర్తింపు పొందారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని కేశవపురానికి చెందిన పస్తం వెంకటయ్య - లక్ష్మిలకు 10 మంది సంతానం. వీరిలో నలుగురు కుమా రులు, ఆరుగురు కుమార్తెలున్నారు. రెండో కుమారుడైన పస్తం మొగిలయ్య అదే గ్రామానికి చెందిన మేనమామ కడెం హన్మంతు-జానవ్వల కుమార్తె కొమురమ్మను 45ఏళ్ల కిందట వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు సుదర్శన్ ఉండగా, తన సోదరుడైన పస్తం రవి కుమార్తె మొజేష్‌ను దత్తత తీసుకున్నారు. ఊరూరా తిరుగుతూ కథలు చెబుతూ మొగిలయ్య కుటుంబం కొన్నేళ్ల కిందట దుగ్గొండికి వలస వచ్చి స్థిరపడింది. ఇందిరమ్మ కాలనీకి చెందిన గృహాన్ని కొనుగోలు చేసి నివాసంగా ఉంటున్నారు. కుమారుడు సుదర్శన్ స్టీల్ సామాన్లు కొనుగోలు వ్యాపారం చేస్తున్నాడు. దత్త కుమార్తెకు వివాహం కావడంతో అత్త వారింట్లో ఉంటోంది.

### అప్పటికప్పుడు కథలు, పాటలు

దంపతులిద్దరూ నిరక్షరాసులైనా కథలు, పాటలు అల్లుకుని పాడడం, చెప్పడం వారి ప్రత్యేకత, శకుంతల, దమయంతి, కాంబోజురాజు, అంజమ్మ తదితర కథలు చెప్పడంలో సిద్ధహస్తులు, ఏ ఊరికి వెళ్లినా ఆ ఊరిలో డేరాలు వేసుకొని కొన్ని రోజులు అక్కడే ఉంటూ కథలు చెబుతూ.. వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబం నెట్టుకొచ్చేవారు.



మొగిలయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

### బలగం సినిమాతో ప్రత్యేక గుర్తింపు

మూడేళ్ల కిందట మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడలోని ఓ ఇంటి వద్ద మొగిలయ్య దంపతుల బుర్ర కథను విన్న రాజమౌళి అనే వ్యక్తి ఈ విషయాన్ని తన బంధువైన బలగం సినిమా దర్శకుడు యెల్దండి వేణుకు తెలిపారు. దీంతో వేణు కొత్తగూడకు చేరుకొని వారి కథను, పాటలను విన్నాడు. తాను తీస్తున్న బలగం సినిమా క్లైమాక్స్ లో పాట పాడేందుకు అవకాశం కల్పించారు. సినిమా విజయవంతం కావడంతో మొగిలయ్య దంపతులకు మంచి గుర్తింపు వచ్చింది.



మొగిలయ్య దంపుతులను సన్మానిస్తున్న బలగం సినిమా డైరెక్టర్ వేణు(ఫైల్)

# ఓపెన్‌కాస్ట్ ఏర్పాటుకు కసరత్తు!

వెంకటాపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏర్పాటు చేయదలచిన పీవీ.నరసింహారావు ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌పై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. 2020 నవంబరు 21న సింగరేణి అధికారులు 25 ఏళ్ల కాల పరిమితితో 40 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ఓపెన్‌కాస్ట్ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. అయితే.. ఇదే క్రమంలో సమీపంలోని రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో ఓపెన్‌కాస్ట్ గనుల పనులను నిలిపి వేయా లని అప్పటి ప్రభుత్వం ఆదేశించడంతో పనులను పూర్తిగా నిలిపి వేశారు. అనంతరం జియోలాజికల్ అధికారులతో సర్వే నిర్వహించారు. ఓపెన్ కాస్ట్‌తో రామప్పకు ముప్పు ఉందా లేదా అనే అంశం సర్వే అధికారులు తేల్చనున్నారు. అయితే ఈ నివేదిక ఇప్పటివరకు బహిరంగం కాలేదు. ఈనేపథ్యంలో రాష్ట్రంలో అధికార మార్పు అనంతరం సింగరేణి సంస్థ

**మళ్లీ చిగురిస్తున్న ఆశలు**

ఆరు ఉపరితల గనులు, ఒక భూగర్భ గని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. వీటిలో వెంకటాపూర్ మండలంలోని పీవీ.నరసింహరావు ఓపెన్‌కాస్ట్ మైనింగ్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఓపెన్‌కాస్ట్ గని నుంచి 2.50మిలియన్ టన్నుల బొగ్గు సామర్థ్యం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ గనులు తిరిగి ప్రారంభించే ఉన్నట్లు విషయం వెలుగులోకి రావడంతో మండలంలోని ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

**మైనింగ్ వల్ల ముప్పు**

మైనింగ్ ప్రారంభమయ్యే ముందు భూములు కోల్పోయిన రైతులందరికీ ఎకరాకు రూ.30నుంచి రూ.35లక్షల చొప్పున నష్టపరిహారం


బొగ్గు నిక్షేపాలను గుర్తించేందుకు సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

చెల్లించాలని, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అసైన్, లావణిపట్టా, పట్టా కలిగిన భూమి 1500ఎకరాలు, అటవీభూమి 1000ఎకరాలు, మొత్తం 2500ఎకరాల్లో సింగరేణి బొగ్గు తీయనుంది. ఈప్రాజెక్టు నిర్మాణానికి 1071.935హెక్టార్ల భూమి అవసరం ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 432.7511 హెక్టార్లలో అటవీభూమి, 639.1839హెక్టార్లలో పట్టా, అసైన్, రెవెన్యూ భూములను గుర్తించారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని ఇప్పటికే సింగరేణి సంస్థ వెంకటాపూర్ శివారుకు అరకిలోమీటర్ దూరంలో ఓపెన్‌కాస్ట్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

## రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలి

**ఏఎన్‌ఎంల 48 గంటల దీక్ష**

ములుగు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాత పరీక్ష లేకుండా తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు 48గంటల నిరసన దీక్ష చేపట్టారు. గురువారం ములుగులోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట టెంట్ వేసి దీక్షలో కూర్చున్నారు. జిల్లా వ్యాప్తంగా 102మంది ఏఎన్‌ఎంలు ఉన్నారని, వీరిలో 20ఏళ్లనుంచి పనిచేస్తున్న వారు కూడా ఉన్నారని తెలిపారు. పనికి తగిన వేతనం ఇవ్వకపోగా 32రకాల రికార్డుల బాధ్యతలను అప్పగించిన ప్రభుత్వం పని ఒత్తిడికి గురి చేస్తోందని వారు వాపోయారు. గతంలో హెల్త్ అసిస్టెంట్లు, వైద్యులు రెగ్యులరైజ్ చేసిన ప్రభుత్వం తమను మాత్రం విస్మరించిందన్నారు. రాత పరీక్షతో సంబంధం లేకుండా కాంట్రాక్టు ఏఎన్‌ఎంలందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యులరైజ్ చేసి అన్ని బెనిఫిట్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గురువారం రాత్రి కూడా డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టిన ఏఎన్‌ఎంలు అక్కడే భోజనం చేసి నిద్రించారు. ఈ దీక్షలో తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట సమితి జిల్లా అధ్యక్షురాలు వై.జమునారాణి, పి.మంజుల, కె.పావణి, పి.సుగుణారాణి, ఈ.లక్ష్మి, పి.సమ్మక్క, ఎస్.శాంత, కె.వెంకటరమణ, కె.సుశీల, ఎం.సీ, పి.అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బాలో ఉద్యోగావకాశం

ఏటూరునాగారం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో బోధన కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న పీజీసీఆర్టీ తెలుగు, పీజీసీఆర్టీ ఫిజిక్స్ పోస్టుల భర్తీకి 2025 విద్యాసంవత్సరానికి తాత్కాలిక పద్ధతిలో పని చేసేందుకు స్థానిక మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. పీజీసీఆర్టీ(తెలుగు) ఎంఏ తెలుగు, పీజీసీఆర్టీ(ఫిజిక్స్) ఎం.ఎస్‌సీ ఫిజిక్స్ బోధించుటకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 20, 21 తేదీలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం కేజీబీవీ ఏటూరునాగారం స్పెషల్ ఆఫీసర్ 9381942209 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

• మంగపేట (ఆంధ్రజ్యోతి): మంగపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పీజీ సీఆర్టీ మ్యాథ్స్, పీజీ సీఆర్టీ ఫిజిక్స్ విభాగంలో, సీఆర్టీ హిందీ బోధించేందుకు తాత్కాలిక మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో మేనక తెలిపారు. ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 20, 21 తేదీలలో మంగ పేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో నేరుగా దరఖాస్తులు సమర్పిం చాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9676012636 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## కరాటే జిల్లా కన్వీనర్‌గా రాజు



ములుగు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ కరాటే క్రీడా జిల్లా కన్వీనర్‌గా జగ్గన్నపేట గిరిజన ఆశ్రమ పాఠశాల పీడీ అజ్మీరా రాజు నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా యువజన క్రీడల అధికారి తుల రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 21న ములుగులోని గిరిజన భవన్‌లో కరాటే ఎంపిక పోటీలు జరగనున్నాయని వెల్లడించారు.

## గొత్తికోయగూడేల్లో వైద్య శిబిరాలు

గోవిందరావుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడితోట, జారుడుబండ గొత్తికోయగూడాల్లో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం వేర్వేరుగా వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు గొత్తికోయలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం వైద్యసిబ్బంది గూడాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఫీవర్‌సర్వే నిర్వహించారు. గొత్తికోయలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. శిబిరాల్లో హెచ్‌వీ శ్యామల, హెచ్‌ఏ జంపయ్య, ఏఎన్‌ఎం కాలిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు

మంగపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస మాసోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయాలతో పాటు ఇతర దేవాలయాల్లో ప్రాతఃకాల పూజలతో పాటు రోజువారీ ఉత్సవాలు జరుగుతున్నాయి. భక్తులు భారీగా దేవాలయాలకు తరలివచ్చి ధనుర్మాస ప్రత్యేక పూజలలో పాల్గొని మొక్కులను చెల్లించుకున్నారు.

## కలెక్టరేట్ ఎదుట కృష్ణకాలనీ వాసుల ధర్నా

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని కృష్ణకాలనీ వాసులు గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కాలనీలో ఇరుకు గా ఉన్న కాల్వలను విస్తరించకపోవడంతో కొన్నేళ్లుగా మురు గునీరు రోడ్లపై ప్రవహిస్తోందని, వర్షం కురిస్తే కాలనీ ముంపునకు గురవుతోందని వారు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు బండారుపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న డ్రెయినేజీలను కాలనీలోకి అనుసం ధానం చేస్తున్నారని, దీంతో రాబోయే రోజుల్లో కాలనీ పూర్తిగా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీంతో రాబోయే రోజుల్లో కాలనీలో నివసించే పరి స్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## ఇసుక సొసైటీ నిర్వహణకు ఆమోదం

వాజేడు, డిసెంబరు 19: మండలంలోని చెరుకూరులో ఇసుక సొసైటీ నిర్వహణకు గురువారం పంచాయతీ అధికారులు గ్రామసభను నిర్వహించారు. సుమారు 200 మందికి పైగా గిరిజనులు చేతులు పైకెత్తి తమ ఆమోదాన్ని తెలిపారు. శ్రీ పోచమ్మ ఆదివాసీ మహిళా సొసైటీకి అప్పగించేందుకు గ్రామసభ ఆమోదం తెలిపిందని ఎంపీవో శ్రీకాంత్ నాయుడు ప్రకటించారు. గ్రామంలో సుమారు 500 మంది ఓటర్లు ఉండగా కోరానికి170 ఓటర్లు కావాల్సి ఉండగా సుమారు 200 మంది ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులతో పాటు, జీపీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పాఠశాలల వేళలు మార్చాలి

వెంకటాపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా మండలంలో ప్రభుత్వ పాఠశాలల వేళలు మార్చాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు జనగాం బాబూరావు గురు వారం ఒక ప్రకటనలో సంబంధిత అధికారులను కోరారు. చలితో విద్యార్థులు అనా రోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు పాఠశాలలు నడపాలని కోరారు.

## దూలాపురంలో ఇందిరమ్మ సర్వే

వాజేడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూలాపురంలో గురు వారం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి పంచాయతీ అధికారులు సర్వే నిర్వహించారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారి నుంచి వివరాలు సేకరించారు. ఈ సర్వేలో ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, కార్యదర్శి శిరిష తదితరులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం నిర్వహించనున్న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ వరంగల్-2 డిపో మేనేజర్ జ్యోత్స్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏమైనా సమస్యలుంటే మధ్యాహ్నం 11నుంచి 12గంటల వరకు 9959226048 నంబర్‌కు తెలియజేయాలని ప్రయాణికులను కోరారు.

## ఎన్‌క్యూఏఎస్‌గా మేడారం ఆరోగ్య కేంద్రం ఎంపిక

మేడారం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం ఆరోగ్య ఉపకేంద్రం ఎన్‌క్యూఏఎస్ (జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు)కు ఎంపికైంది. ఈ మేరకు ములుగు జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్ కుమార్ అన్నారు. తాడ్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రణధీర్ ఆధ్వర్యంలో మేడారంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో నేష నల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ సభ్యులతో మొబైల్ కాన్ఫరెన్స్ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విపిన్ కుమార్ మాట్లాడుతూ ఎన్‌క్యూఏఎస్‌కు మేడారం ఉప కేంద్రం ఎంపిక కావడం సంతోషంగా ఉంద న్నారు. ప్రజలకు 14రకాల రాపిడ్ టెస్టులు గర్భని ర్ధారణ, రక్త శాతం, మలేరియా, డెంగీ, మధుమేహం, రక్తపోటు, హెచ్‌ఐవీ, హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్ ఏజీ, మూత్ర పరీక్ష, సాల్ట్ టెస్ట్, వీడీఆర్ ఎల్, సికిల్‌సెల్, క్షయ నిర్ధారణ తెమడ నమూనా సేకరణ అందుబాటులో ఉంటా యన్నారు. టెలికాన్ఫ రెన్స్ ద్వారా వైద్యులు, సిబ్బందితో ఎన్‌క్యూఏ ఎస్ అధికారులు మాట్లాడడం జరిగిందన్నారు. మేడారం ప్రజలకు, భక్తులకు మెరుగైన వైద్య సౌక ర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి చిరంజీవి, జిల్లా క్వాలిటీ మేనేజర్ శరత్‌బాబు, డిప్యూటీ పారా మెడికల్ అధికారి సంజీవరావు, సబ్ యూనిట్, అసంక్ర మిక వ్యాధుల జిల్లా కోఆర్డినేటర్ వంగేటి వెంకటేశ్వర్లు, హెల్త్ ఎక్స్టెన్షన్ అధికారి సమ్మయ్య, సూపర్‌వైజర్లు సరస్వతి, ఉషా, పల్లె దవాఖాన వైద్యులు, డీడీఎంఎస్, ఏఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## తపాలా సేవలు విస్తృత పర్చాలి

**హైదరాబాద్ రీజినల్ జనరల్ పోస్ట్ మాస్టర్**


సుమిత అయోధ్య వినతిపత్రం అందిస్తున్న కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తపాలా సేవలను విస్తృత పర్చాలని హైదరాబాద్ రీజినల్ జనరల్ పోస్ట్ మాస్టర్ సుమిత అయోధ్య అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన హైదరాబాద్ రీజినల్ జనరల్ పోస్ట్ మాస్టర్ సుమిత అయోధ్య కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సుమిత అయోధ్యకు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జిల్లాలో పోస్టల్ సేవలను విస్తృతం చేసేందుకు సుమిత అయోధ్య కలెక్టర్ రాహుల్‌శర్మతో చర్చించారు. జిల్లాలో పోస్టల్ సర్వీసుల విస్తరణ చేయటమే జిల్లా పర్యటన ఒక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. నీతి అయోగ్ వెనుకబడిన జిల్లా పోస్టల్‌శాఖ నోడల్ అధికారిగా జిల్లాకు వచ్చినట్లు సుమిత అయోధ్య కలెక్టర్‌కు తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, సీపీఓ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా శాఖను ప్రక్షాళన చేయాలి

గోవిందరావుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవినీతిపరులను తొలగించి జిల్లా విద్యాశాఖను ప్రక్షాళన చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ, జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని చల్వాయి జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో గురువారం జరిగిన సమావేశంలో నాయకులు వాసుదేవరెడ్డి, చాప బాబు, గన్‌రెడ్డి ఆదిరెడ్డి, హట్కర్ సమ్మయ్యలు మాట్లాడారు. జిల్లా విద్యాశాఖలో గతంలో జరిగిన అవినీతి అక్రమాలతోపాటు ఇటీవల వెలుగులోకి వచ్చిన ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ల గల్లంతు జరిగిందని ఆరోపించారు. కొందరు విద్యా శాఖలో తిష్టవేసి పైరవీకారులుగా, అవినీతిపరులుగామారి విలువలకు తిలోదకాలు ఇచ్చి విద్యాశాఖను భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా సైన్స్ అధికారి జయదేవ్‌ను విధుల నుంచి తొలగించి పాఠశాల విధులకు పంపాలని, క్వాలిటీ కోఆర్డినేటర్‌గా ఉన్న మల్లారెడ్డిని తొలగించి నిబంధనల ప్రకారం నియామకం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

## షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై కమిషన్‌కు వినతి

కన్నాయిగూడెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై అధ్యయనం కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్‌కు హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ విచారణలో తెలంగాణ నేతకాని మహర్ కుల హక్కుల పరిరక్షణ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు జాడి రాంబాబు ఆధ్వర్యంలో చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్‌కు వినతి పత్రాన్ని అందించారు. నేతకాని కులాన్ని మరో కులానికి ఉపకులంగా పరిగణించకూడదన్నారు. ఏకులానికి ఆ కులం ప్రత్యేకంగా భావించి నేతకాని కులాన్ని బీసీడీ గ్రూపులో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు కుమ్మరి చంద్రబాబు, నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోగు సుధాకర్, నేతకాని సంఘం కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు సునార్కని రాంబాబు, జిల్లా నాయకులు కావేరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు

వాజేడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు భగీరథ సిబ్బంది గురువారం మరమ్మతులు నిర్వహించారు. రోడ్డు విసర్తరణ పనులో భాగంగా చెట్లు తొలగిస్తున్న క్రమంలో పైప్‌లైన్ ధ్వసమైంది. ఈ క్రమంలో సుమారు 30 గ్రామాలకు పైగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో హుటాహుటిన సిబ్బంది మరమ్మత్తులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధించారు.

## సీఎం కప్ సైక్లింగ్ పోటీలు ప్రారంభం

గణపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలను మండలంలోని చెల్పూరులో గురువారం ప్రారంభించారు. స్పెషల్ ఆఫీసర్లు బాలకృష్ణ, రఘు ఆధ్వర్యంలో ఇవి జరిగాయి. బాలురకు పది కిలోమీటర్లు, బాలికలకు ఐదు కిలోమీటర్ల సైక్లింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సైక్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బోనాల రాజమౌళి, సెక్రటరీ ఆనంద్, ప్రధానోపాధ్యాయుడు అశోక్, సురేష్, మాజీ సర్పంచ్ మధుసుధన్ రావు, మాజీ ఎంపీపీ కావటి రజిత, మాజీ ఎంపీటీసీ సుధర్మమలహల్‌రావు, రమ, కార్యదర్శి హరిచంద్రారెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణం తనిఖీ

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

చిట్యాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మనగ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఎరువుల బస్తాలో దొడ్డు బియ్యం అంశాన్ని పేర్కొంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. దుకాణంలోని ఎరువుల బస్తాలను పరిశీలించి సంబంధిత నివేదికను జిల్లా అధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

## పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించాలి

కాటారం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంపీవో వీరస్వామి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి, మద్దులపల్లి తదితర జీపీల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి పూర్తి స్థాయిలో సర్వే చేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సర్వే వివరాలను పొందుపర్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు జ్యోత్స్న, రాజశేఖర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఉద్యోగులనిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు పలువురు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో సంజీవరెడ్డి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత తిరుపతి, సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వసుల వినయ్ మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులతో ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయిస్తున్నాయని అన్నారు. ఈ క్రమంలో వారిని పర్మనెంటు చేసి వారికి అన్ని రకాల బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. మండల కేంద్రంలో నాయకులు గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.డి.దిల్షాద్ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర మంత్రి వర్గం యూపీఎస్ విధానాన్ని అమలు చేయడానికి ఆమోదం తెలిపిందని అన్నారు. ఇది సరికాదని అన్నారు. దీని వల్ల అందరికీ నష్టం జరగుతుందని, దీన్ని రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, అనిల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకూ తపాలా సేవలు అందాలి

**డివిజన్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అజ్హరుద్దీన్**

కాటారం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):తపాలాశాఖ ద్వారా అందిస్తున్న పొదుపు పథకాలతో పాటు అన్ని రకాల సేవలను ప్రతి గడపకు అందేలా చర్యలు తీసుకోవాలని తపాలాశాఖ మంథని డివిజన్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అజ్హరుద్దీన్ అన్నారు. కాటారం ఉప తపాలాకార్యాలయం పరిధిలోని కొత్తపల్లిలో గురువారం కాటారం, మహదేవపూర్ ఎస్వోల పరిధిలోని బీపీఎంలు, ఏబీపీఎంలకు తపాలశాఖ సేవలపై అవగాహన కల్పించారు. 2024-2025ఆర్థిక సంవత్సరంలో తపాలశాఖ లక్ష్యాలను అధిగమించడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఇన్‌స్పెక్టర్ అజహరుద్దీన్ మాట్లాడుతూ గ్రామస్తులకు తపాలశాఖ అందిస్తున్న పొదుపు, బీమా పథకాలపై అవగాహన కల్పించాలని, వారి వారి అభిరుచులు, ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని వారికి కావాల్సిన పథకాలను అమలు చేయాలన్నారు. బ్యాంకింగ్ సేవలు పకడ్బందీగా అందించాలన్నారు. ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించి అందించాల్సిన తపాల సేవలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెయిల్ ఓవర్సీస్ శంకర్, సత్యం, బీపీఎంలు కిష్టయ్య, సురేష్‌రెడ్డి, రవి, కిరణ్, మల్లయ్య, హరీష్, మహేష్, జానీ, తదితరులు ఉన్నారు.

# అమిత్‌షా వ్యాఖ్యలపై ఆగ్రహం

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారని, దీనిపై ఆయన క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆందోళనకు దిగారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్ చార్జి పసులోది ముఖేష్, ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్, ప్రజాసంఘాల జేఏసీ నాయకులు బండి నర్సయ్య, ముత్యాల రాజు, కోకిల అజయ్‌కుమార్, గంగారపు రాజు, అన్వేష్, ఎర్రబెల్లి రమేష్, అశోక్, రత్నం ప్రవీణ్; రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

• గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుండు రామస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొదిళ్ల చిట్టి బాబు, రఘుపతి, మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

• వాజేడు (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తప్పించాలని బీఎస్పీ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి కుమ్మరి రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో అంబేద్కర్‌పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


ములుగులో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

• తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని ఏజెన్సీ దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు దుర్గం రమణయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో రమణయ్య మాట్లాడారు.నాయకులు బండారు చంద్రయ్య, దానుక నర్సింహారావు, నర్సయ్య చల్లారి లక్ష్మయ్య, భూపతి జనార్దన్, దాసరి కృష్ణ, కొత్తపేట శ్రీరాములు, చౌగాని రఘు, గాంధర్ల రమేష్, కుమ్మరి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

• మంగపేట (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై చేసిన అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు చిట్టిమల్ల సమ్మయ్య తెలిపారు. గురువారం మంగపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

• కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలకు బేషరతుగా దేశానికి ఆయన క్షమాపన చెప్పాలని నేతకాని మహర్ కుల హక్కుల పరి రక్షణ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు జాడి రాంబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సవవేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ములుగు జిల్లా కమిటీ మెంబర్ సునార్కని రాంబాబు, చంద్రబాబు, సంతోష్ , దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ పాఠశాలగా జడ్పీహెచ్‌ఎస్

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : మల్టీజోన్-1 పరిధిలో ఉన్న మహదేవపూర్ జడ్పీ బాలికల హైస్కూల్ రాష్ట్రస్థాయి ఉత్తమ పాఠశాల గా ఎంపికైం దని ప్రధానోపాధ్యాయురాలు సరిత తెలిపారు. రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల స్థాయి ల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడం వల్లే పాఠశాలకు గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. ఇందులో ఉపాధ్యాయులు మడక మధు, సుధారాణి, సరితాదేవి, ఒలిపాషా, శ్రీనివాస్, వసుధప్రియ, వీరేషం, సమ్మయ్య పాత్ర కీలకమని తెలిపారు. .

# పార్టీలతోనే సరి.. పరిశీలన ఏది మరి?

**ముగిసిన సింగరేణి భద్రతా పక్షోత్సవాలు ● విందులతోనే కాలక్షేపం చేశారని కమిటీ సభ్యులపై ఆరోపణ**

కాకతీయఖని, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియాలో నాలుగు అండర్‌గ్రౌండ్ గనులు, రెండు ఓపెన్ కాస్టు ప్రాజెక్టుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. అయితే ప్రతి ఏడాది డిసెంబరులో 15 రోజుల పాటు అన్ని ఏరియాల్లో రక్షణ పక్షోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో ఆ కమిటీ కన్వీనర్, సభ్యులు ఆయా గనులు, ఓసీల్లో తిరిగి పనిస్థ లాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆ పనిస్థ లాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా, ఆ గనిలో ఏదేనీ ప్రమా దం జరిగి ఉన్నా వెంటనే సంబంధిత అధికారులపై రక్షణ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అందుకు భిన్నంగా జరిగింది.

భూపాలపల్లి ఏరియాలో ఈ నెల 9 నుంచి 19 వరకు భద్రతా పక్షోత్సవాలను నిర్వహించారు. రక్షణ కమిటీ సభ్యులు గనులు, ప్రాజెక్టులు తిరగకుండానే పైపైన తిరిగి అనంతరం సంబంధిత అధికారులు ఇచ్చే విందులో పాల్గొని పండుగ చేసుకున్నారని ఆయా గనులు, ప్రాజెక్టులలో పనిచేసే కార్మిక వర్గంలో తీవ్రమైన చర్చ జరిగింది. సాయంత్రం అయ్యిందంటే.. ఏరియాలోని ఇల్లందు క్లబ్‌హౌస్‌లో కూర్చుని ఆటపాటలతో పాటు చిందులు కూడా వేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనంతటికీ కారణం ఆయా గనులు, డిపార్ట్‌మెంట్ల అధికారులేనని తెలుస్తోంది. ఏ గనికి వెళితే.. ఆ గనికి సంబంధించిన అధికారులు మచ్చిక చేసుకుని మంచి మార్కులు వేయించుకునేందుకు ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఈ పార్టీలు జరిగినట్లు కార్మికులు చర్చించుకుంటున్నారు. కార్మికులకు రక్షణ కవచంగా నిలిచి వారి బాగోగులు చూడాల్సిన ఆ రక్షణ కమిటీ బృందం మమ అని వెళ్లడం పట్ల కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

## తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో పోటీల్లో భూపాల పల్లి పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. సీఎం కప్ క్రీడా ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న తైక్వాండో పోటీల్లో భూపాలపల్లిలోని మాంటిస్సోరీ పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయం విద్యార్థులు తనిష్, చేతన్, స్ఫూర్తి, వైష్ణవి, శృతి, పూజిత, శ్రావణి తదితరులు అండర్ 14 విభా గంలో ప్రతిభ కనబరిచారని కోచ్ దిలిప్‌కుమార్ తెలిపారు.

# ఘనంగా అయ్యప్ప నగర సంకీర్తన

ములుగు, డిసెం బరు 19(ఆంధ్రజ్యోతి): హరిహర సుతుడు అయ్యప్ప స్మరణతో ములుగు పట్టణం మార్మోగిపోయింది. అయ్యప్ప భక్తమం డలి ఆధ్వర్యంలో గురువారం స్థానిక రామాలయం ప్రాంగణంలో 18 కలశాల మహా పడిపూజోత్సవం కన్నుల పండువగా జరిగింది. తొలుత ప్రధాన వీధులు, జాతీయ రహదారి మీదుగా నగర సంకీర్తన నిర్వహిం చారు. వందలాది మంది అయ్యప్ప మాలధారణ చేసుకున్న స్వాములు భగవంతుడిని కీర్తిస్తూ భజనలు, నృత్యాలు చేశారు. దేవతా వేష ధారణలో పలువురు కళాకారులు సంకీర్తనలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన పడిపూజోత్సవంలో మాజీ వార్డు సభ్యుడు పైడిమళ్ల గోపీకృష్ణ గౌడ్ పడి వెలిగించారు. నర్సంపేట హరిహర క్షేత్రం ప్రధాన అర్చకులు దేవేశమిశ్రా గురుసామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్తులు, మహిళలు వందల సంఖ్యలో పాల్గొని భజనలు చేశారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తమండలి అధ్యక్షుడు భూక్యా రమేష్, ఉపాధ్యక్షులు పొడాల ఓంప్రకాశ్, కోగిల కవిరాజు, ప్రధాన కార్యదర్శులు శీలమంతుల విఘ్నేశ్వరస్వామి, దొంతిరెడ్డి రాకేష్‌రెడ్డి, సానికొమ్ము శ్రీనాథ్‌రెడ్డి, వెల్దండి కిరణ్, బానాల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


నగర సంకీర్తనలో అయ్యప్ప స్వాములు